

# విష్ణుమూర్తి ఎక్స్‌పెరిమెంటు

వి. విజయలక్ష్మి

జగద్రక్షకుడైన శ్రీ మహావిష్ణువు పాల కడలిలో శేషశాయిపైన పవ్వళించి, లక్ష్మీ దేవితో ముచ్చటలాడుతున్నాడు. ఉన్నట్టుండి తను చెపుతూన్న మాటను సగంలోనే ఆపివేసి చెవియొగ్గి యేదో వినసాగేడు. తన నాథుడంత శ్రద్ధగా ఆలకించుచున్న విషయ మేమాయని లక్ష్మీదేవి కలవరపడింది. 'యెవరైనా పరమభక్తుని మొర అయి ఉండవచ్చు. ఆనాడు గజరాజు మొర విని వచ్చినరోజు, ఈయన ఇలాగే ఓ నిముషం విన్నారో లేదో, అంతే సంగతేమిటో నాకు చెప్పకుండానే హడావిడిగా, చేతిలో ఉన్న నా చీరకొంగు పట్టుకొనే పరుగెత్తారు! ఆయన వెనకాతల పరుగెత్తేసరికి నాకు ఆయాసం వచ్చేసింది. ఆ కోవకే చెందిన భక్తుడి ఆర్తనాదం కాదుకదా?' అనుకొని సిరికూడా శ్రద్ధగా వినసాగింది.

అది భూలోకంలోనుంచి ఒక పేద కవి పిలుపు. వింటూంటే అతను విష్ణుమూర్తిని భక్తితో పిలుస్తూన్నట్లు లేదు. పైగా యెత్తిపొడుపులా ధ్వనిస్తూంది.

కవిగారు లక్ష్మీపతిని యేకిపారేస్తున్నారు. 'ఆహా విష్ణు జగద్రక్షకు డంటారు. నీకంటే శివుడే నయం. తన పోర్టు ఫోలియోని శ్రద్ధగా నిర్వర్తిస్తున్నాడు. జగత్తుని రక్షించడం అంటే ఏమిటో అసలు నీకు తెలుసునయ్యా విష్ణుమూర్తీ?

'ఏమిటయ్యా నీ రక్షణా నిభిజ్ఞత? ఒక వైపేమో బ్రహ్మాండమైన సంపదా, మరొక వైపేమో దుర్భరమైన దారిద్ర్యమూ సృష్టించావు. ఈ రెండింటికీ జరిగే నిర్విరామ, నిరంతర పోరాటంలో ప్రపంచంలో సుఖశాంతులు కరవైపోతూంటే చూస్తూ ఊరుకొంటున్నావు.

'పైగా నీ కరుణాకటాక్ష వీక్షణముచే సంపన్నులయినవారు, నిరంతర దారిద్ర్యంతో నిస్పృహాయులైనవారిని గ్రద్దల్లాగా పీక్కుతిని ఇంకా ధనవంతులవుతూంటే నీవు ఏమి చేయకుండా ఊరుకొంటున్నావు. ఏమి పక్షపాతమయ్యా — లోకపాలకుల కుండవల్సిన లక్షణమేనా ఇది.

'ఓ జగద్రక్షకా, ఈ ప్రపంచాన్ని ఏ భూమ్మీద పడేస్తున్నావేగాని మన్ని సంపదని యెప్పుడూ కొద్ది మంది చేతుల్లో మాత్రమే ఉంచి, కోకొల్లలుగా మిగిలిన వారికి దారిద్ర్యాన్ని మిగులుస్తున్నావు. ఈ పృథివిమీద సంపద అందరికీ సమానంగా ఉండేలా చూసి, మానవులకు సంతృప్తినీ, సుఖశాంతుల్నీ కల్గించటం చేతకాదుటయ్యా నీకు?'

అంటూ అర్థం వచ్చేలాగ తన కవిత్వంతో వైకుంఠవాసుణ్ని ఏకివేస్తున్నాడు కవిగారు.

కవిగారి ఛందోబద్ధమైన తిక్కరు విన్న లక్ష్మీదేవికి కవిగారి మీద బాగా కోపం వచ్చేసింది.

'చూశారా, చూశారా! ఇదంతా ఆ జ్యేష్ఠాదేవి ప్రోద్బలం లేకపోతే, మానవ మాత్రుడు, అందులో కూటికి గతిలేనివాడు ఇలా నిందిస్తాడా మిమ్మల్ని?'

అంది భర్త నుద్దేశించి.

'పిచ్చిదానా, కష్టాలను భరించకలేక శక్తి కోల్పోయినప్పుడు మానవుడు తన కష్టాలకు దేముణ్ని బాధ్యుడిగా చేయటం సహజం,

మానవసైజం తెల్సిన మనము కోపగించుకొంటే యెలా' అని విష్ణుమూర్తి నవ్వ చెప్పినవిగాదట.

'అయితే ఇప్పుడేమి చేయబోతున్నారు' అని ప్రశ్నించింది లక్ష్మీదేవి.

'ఏముంది, ఈ కవిగారి సమస్యకి రెండు పరిష్కార మార్గాలున్నాయి. అందులో మొదటిదీ, సులువయినదీ ఏమిటంటే ఈ కవిగార్ని సంపన్నునిగా చేయడం. అప్పుడు అతను ఈ ఘాటు కవిత్వం మానివేస్తాడు. అసలు భూలోకంలో దారిద్ర్యం, కష్టాలు అనేవి ఉన్నాయి అన్న సంగతే మర్చిపోయి ఏవో కులాసాగీతాలు రాసుకొంటూ ఆనందిస్తాడు.

ఇక రెండో మార్గమేమిటంటే, కవిగారి సలహా ననుసరించి భూలోకంలో అందరికీ సమానంగానే సంపద ఉండేలాచేసి, మానవులందరూ సంతృప్తికరంగా, ఏ ఒడుదుడుకులు లేకుండా జీవయాత్ర సాగించుతారేమో చూడవచ్చు. నీ సలహా ఏమిటి?' శ్రీ యొక్క సహకారం లేనిదే ఈ రెంటిలో ఏదీ అమలులోకి రాదు కనుక ఆమె సలహా కోరాడు విష్ణుమూర్తి.

'నా కెందుకో రెండో పద్ధతి నచ్చింది. అందులో నవీనత ఉంది, ప్రయోగాత్మకంగా చూసి. అయితే దానినే అమలులో ఉంచవచ్చును' కొత్త సోకడలయందుండే స్త్రీ సహజమైన ఉత్సాహంతో జవాబిచ్చింది లక్ష్మీదేవి

ఇంకేం, చూస్తుండగా భూలోకంలో ధనవంతులూ, పేదలూ అంటూ తెగలు పోయాయి. అందరికీ ఆదాయ వ్యయాలు సమంగానే ఉంటున్నాయి. ప్రతి వ్యక్తికీ తిండికీ, బట్టకీ, ఉండడానికి జాగాకీ లోటులేదు ఒక్కరికి పట్టుబట్టలూ, మరొకరికి చింకిపాతలూ అనేవి లేవు. ఒకరు మేడలోనూ మరొకరు పూరి గుడిసెలోనూ ఉండటం అనేవి లేవు. ప్రతి వ్యక్తి అన్నీ సమానమే.

ఆలా కొన్ని సంవత్సరాలు గడిచాయి. భూలోకవాసులంతా రోజులన్నీ ఒక్కలాగే, ఏ విధమయిన ఒడిదుడుకులూ లేకుండా వెళ్లబుచ్చుతున్నారు.

ఇక ఫరవాలేదు. మనం ప్రవేశపెట్టిన కొత్త విధానం సాఫీగానే సాగిపోతూంది, అనుకొని నిట్టూర్పు విడిచాడు విష్ణుమూర్తి. రిలాక్సింగుగా ఉంటుంది అని లక్ష్మీదేవితో చదరంగం ఆట కుపక్రమించాడు. రెండు యెత్తులు వేశాడో లేదో మళ్ళీ భూలోకంనుంచి ఒక ఆర్తనాదం వినిపించింది. ఈ మాటు విష్ణుమూర్తికి నిజంగా విసుగు కలిగింది. 'ఏమిటీ సొద' అని వినసాగాడు. పాత కవిగారి గొంతే అది.

'జగద్రక్షకా, ఇదెక్కడి సంకెళ్లు తగిలించావయ్యా మాకు. జీవితంలో నూతనత్వమంటే ఏమిటో మరచిపోయాము—ఏమిటీ యాంత్రికమయిన జీవితం? యంత్రాలు తయారుచేసే పరికరాలైనా తేడాగా ఉంటాయేమోగాని భూలోకంలో మానవుల జీవిత విధానాల్లో మాత్రం తేడా అంటూ ఉండటం లేదు. ఈ రోజు నిన్నటిలాగే గడుస్తూంది—రేపు ఈ రోజులాగే గడుస్తుంది కళలు నశించిపోయాయి. మానవుడు తన సృజనాత్మక శక్తినే కోల్పోతున్నాడు. ఆ రోజుల్లోలాంటి జీవముట్టిపడే చిత్రకళ ఏది? దేవదేవుని హృదయాన్ని కదిలించగల్గిన సాహిత్యమేది?

'ఓ విష్ణుమూర్తీ, మానవుని సంతృప్తి అతని ప్రగతినే అవరోధిస్తుంది. జీవితంలో ఇంకా ఏదో రావాలి, దేన్నో పొందాలి అనే ఆకాంక్షలేని రోజుని జీవించి ఏమి లాభమయ్యా? పొటివాడికన్నా తను ఏదో విషయంలో అధికుడ్నని నిరూపించుకోవడంలో ఉండే ఆనందమేకదా మానవుని సృజనాత్మక శక్తికి మూలాధారం? దాని కిప్పుడు తావే లేకపోయింది. నవరసభరితంగా ఉండవల్సిన మానవజీవితము, ఏమిటో యెప్పుడూ చప్పగా ఉంటోంది. నా చుట్టూ మనుష్యులు జడుల్లాగా తిరుగుతూంటే నాకు ఆదిమ మానుషులే జ్ఞాపకం వస్తున్నారు. తరతరాలుగా మానవజాతి సంపాదించిన ఆ సంస్కృతి, ఆ చైతన్యం ఏవి? ప్రభూ జీవచ్ఛవంలాగా నేనీ పృథివిమీద బతకలేను, నన్ను నీలో చేర్చుకో' అంటూ రాగాలెడుతున్నాడు కవిగారు.

విష్ణుమూర్తి తల పంకించుతూ లక్ష్మీదేవి వైపు చూశాడు.

'ఎక్స్పరిమెంటు ఫెయిలయింది' అందామె నవ్వుతూ.

